ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించండి

నిర్మల్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు. అంతకుముందు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు పాలనాధికారులు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరం

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఇందులో మహిళా అధికారులతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలకు ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్డీవో విజయలక్ష్మి, మహిళా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మహిళా అధికారులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

అదనపు కలెక్టర్‌కు అభినందన

నిర్మల్: ఉత్తమ హస్తకళ విభాగంలో జాతీయ అవార్డు అందుకున్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. ఉత్తమ పర్యాటక గ్రామంగా హస్తకళ అవార్డును ఉపరాష్ట్రపతి నుంచి అందుకున్న ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డు అందుకోవడం సంతోషకరమని, అందుకు ప్రోత్సహించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు చెప్పారు.

అండగా చట్టాలు.. ఆపదలో నేస్తాలు

● నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం



అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న మంచిర్యాల మండలం మద్రికి చెందిన లక్ష్మి (70)ని కూతురు, అల్లుడు చూడడం లేదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి భర్త పోశం సింగరేణి కార్మికునిగా పనిచేస్తున్న క్రమంలో చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. కాగా అందరి పెళ్లిలు చేసింది. లక్ష్మి బాధ్యతలు చిన్నకూతురు మరియమ్మ అల్లుడు జాని చూసుకుంటానని చెప్పడంతో పోశం సింగరేణి ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద ఇచ్చింది. కొన్ని నెలలుగా వారు పట్టించుకోకపోవడంతో పాటు తిడుతుండడంతో కలత చెందిన బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమశాఖ అధికారులు ఆమెను శ్రీ సాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు.

అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల బాగోగులు చూడటంలో కొందరు పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారు. చిన్న చిన్న కారణాలతో అనాథలుగా రోడ్డున పడేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యతల విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాలు తీసుకొచ్చింది. హక్కులు కాపాడటం, రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం.

మందమర్రి పట్టణం, ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో
వయోవృద్ధుల కుటుంబాలు : **1,580**
వృద్ధాశ్రమాలు : **5**

చట్టం ఏం చెబుతుందంటే..

◆ తల్లిదండ్రులను పోషించడానికి, వారి సంరక్షణ చర్యలు తీసుకోవడానికి పిల్లలు ముందుకు రాకుంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలి.

◆ 57 సంవత్సరాలు దాటిన వారు సీనియర్ సిటిజన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.

◆ ఆర్డీవో కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తుల పరిష్కారానికి ప్రత్యేకంగా న్యాయ సహాయ కేంద్రాలు (ట్రైబ్యునళ్లు) ఏర్పాటు చేశారు.

◆ ఫారం-ఏ నింపి దరఖాస్తును ఆర్డీవోకు ఇస్తే వారి స్థిర చరాస్తులు గతంలో పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ వాటిని రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఇచ్చే అధికారాన్ని చట్టం కల్పిస్తోంది.

◆ వారికి ఆహారం, దుస్తులు, నివాసం, మందుల ఖర్చులు భరించాలి. లేని పక్షంలో పోషణకు నెలకు రూ.10 వేలు చెల్లించాలి.

◆ 2007 చట్ట సవరణ ప్రకారం కొడుకులతో పాటు కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మైనార్టీ తీరిన మనుమలు, మనుమరాళ్లు కూడా వారి బాధ్యత స్వీకరించాలి.

◆ దరఖాస్తుల పరిష్కారానికి రెండు నెలల గడువు విధించారు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువును ఒక్కసారి మరో 30 రోజులు పొడిగించేందుకు విచారణాధికారికి వీలుంటుంది.

జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ

సీనియర్ సిటిజన్ల సంరక్షణ, పోషణకు జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, డీఆర్‌డీఏ, ఆర్డీవో, సీనియర్ సిటిజన్ ఫోరం, ఎన్జీవోల నుంచి ఒక మహిళతో సహా ముగ్గురు వయోవృద్ధులు, జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంరక్షణాధికారులు సభ్యులుగా ప్రత్యేక కమిటీ ఉంటుంది. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ఆయా సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

సంరక్షణ కోరుకునే వారు ఏం చేయాలంటే...

పిల్లలు తమను సంరక్షించకుంటే వారు ఆర్డీవో వద్దకు వెళ్లి ఫారం -ఏ నింపి అందజేయాలి. దీనికి న్యాయవాదితో కూడా అవసరముండదు. అధికారులు తగిన సహకారం అందిస్తారు. అనంతరం ఆర్డీవో విచారణ నిర్వహించి పోలీసులకు తదుపరి చర్యల కోసం రాసే అవకాశం ఉంటుంది. లోక్ అదాలత్‌లో అర్జి ఇవ్వగలిగితే న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి చర్యలకు ఆదేశాలు ఇచ్చే అవకాశముంది. మానవ హక్కుల కమిషన్ ద్వారా కూడా ఉపశమనం పొందే వీలు ఉంటుంది.

అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలు



కుటుంబ సభ్యుల నుంచి గెంటివేసిన, నిరాదరణకు గురైన, వీధిన పడిన వృద్ధులను వృద్ధాశ్రమాలు అక్కున చేర్చుకుంటున్నాయి. వారికి అన్నివిధాలా సేవలు అందిస్తూ ఆత్మీయుల్లా చూసుకుంటున్నాయి.

టోల్‌ఫ్రీ నెంబరు.. అందించే సేవలు

◆ వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా 14567 అనే హెల్ప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

◆ మానసిక ఇబ్బందులు ఉన్నవారు సాయం పొందవచ్చు. నడవలేని వారికి చక్రాల కుర్చీలు, చేతికర్రలు సమకూరుస్తారు.

◆ వయోవృద్ధుల ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై స్థాయి వ్యక్తిని ప్రత్యేక అధికారి నియమించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారికి ఆరు నెలల నుంచి గరిష్ఠంగా 2 సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. రూ.10 వేల వరకు జరిమానా విధించేలా చట్టం రూపొందించారు.

డీఎస్సీ ఫలితాల విడుదల

నేటి నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 రాత పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. దీంతో జిల్లాల వారీగా ఖాళీలను ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో వివిధ హోదాల్లో మొత్తం 342 ఖాళీలు భర్తీ కానున్నాయని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి అక్టోబరు 5 వరకు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో చేపట్టనున్నామని చెప్పారు. ఎంఈవోలు, సీనియర్ ప్రధానోపాధ్యాయులతో 10 పరిశీలన బృందాలను నియమించామని వివరించారు. ఎంపికైన అన్ని కేటగిరీల నుంచి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల చరవాణి, మెయిల్‌కు సందేశాలు వస్తాయని చెప్పారు. జాబితాను deonirmal.weebly.com వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్స్‌తోపాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు జతల జిరాక్స్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివిధ ప్రాధాన్యత కేటగిరీలకు చెందిన వారు తమ కులం, ప్రిఫరెన్షియల్ కేటగిరీ, క్రీడలు, మాజీసైనికోద్యోగులు, ఈడబ్ల్యూఎస్, తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ధ్రువీకరించుకోవాలని కోరారు.

■ హోదా	■ ఖాళీలు
స్కూల్ అసిస్టెంట్	70
భాషా పండితులు	04
పీఈటీ	04
ఎస్జీటీ	236
స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	05
ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	23

డెంగీతో వివాహిత మృతి!

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్‌కు చెందిన వివాహిత భైరి శ్రీలత(24) డెంగీ జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. శ్రీలతకు అయిదు రోజుల కిందట జ్వరం రావడంతో ముందు లోకేశ్వరంలో, అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రెండు రోజుల కిందట హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం ఉదయం మరణించినట్లు వారు పేర్కొన్నారు. శ్రీలతకు భర్త, ఇద్దరు కుమారులున్నారు.


భైరి శ్రీలత

గుండెను కాపాడుకుందాం

భైంసా, న్యూస్‌టుడే: మారిన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై అవగాహన లేక చాలా మంది గుండె జబ్బులతో మృతి చెందుతున్నారని ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.యు.కాశీనాథ్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం గురుకృప కళాశాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. గుండెను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన ఆహారం, అలవాట్లు, జాగ్రత్తలు, వ్యాయామాలపై ఆయన వివరించారు. డా.రామకృష్ణాగౌడ్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భైంసాలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

గీత కార్మికులకు అవగాహన

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దిలావర్‌పూర్‌లో సోమవారం ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల గీత కార్మికులకు కాటమయ్య రక్షణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కడానికి ఉపయోగించే కిట్లు పనిచేసే విధానాన్ని వారికి వివరించారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై అభిషేక్, సిబ్బంది గౌడ సంఘం కులస్థులు పాల్గొన్నారు.


దిలావర్‌పూర్‌లో గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కాటమయ్య రక్షణ సంస్థ

మా మొర ఆలకించండి

ప్రజావాణిలో బాధితుల గోడు

నిర్మల్, న్యూస్‌టుడే: వివిధ సమస్యలను విన్నవిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బాధితులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎదుట తమ గోడు వినిపించారు. సమస్యలు పరిష్కరించాలని గతంలో విన్నవించుకున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడంలేదంటూ ఆవేదన చెందారు.


బాధితుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్

ఆక్రమణలు అరికట్టండి



నా పేరు గౌర సాయినాథ్. కుభీరు మండలం కస్రా గ్రామం. మా ఇంటి వెనుక ప్రాంతంలో ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణకు వచ్చిన అధికారులు కబ్జా, అక్రమ నిర్మాణాలని నిర్ధారించారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని అధికారులు చెప్పినా ఆ వ్యక్తి నాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు.

అధికారుల తప్పిదంతో ఇబ్బందులు



నా పేరు గడ్డం నాగన్న. నిర్మల్ మండలం వెంగ్వాపేట్. సర్వే నెంబరు 43లో 18 గుంటల భూమి ఉంది. ధరణిలో తప్పిపోవడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. కలెక్టర్ వరకు ఫైల్ చేరిందని, అక్కడ ఆమోదిస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. తీరా కలెక్టరేట్ నుంచి ఓ అధికారి ఫోన్ చేసి నీ దరఖాస్తు పోయింది.. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. భద్రంగా ఉంచాల్సిన దరఖాస్తును నిర్లక్ష్యంగా పడేయడంతో మళ్లీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు తీసుకొచ్చారు.

న్యాయం చేయండి

మేమంతా బాసర మండలం ఓని గ్రామస్థులం. పూర్వికుల పేర్లపై 17.17 ఎకరాల భూమి ఉంది. 2013 వరకు పంటలు సాగు చేశాం. కొందరు వ్యక్తులు తమ భూములకు నకిలీ పట్టాలు సృష్టించుకుని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. మాపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. 2018లో ధరణిలో వారి పేర్లపై నమోదు చేసుకున్నారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేయండి.

కొట్టుకుపోయిన రోడ్డుతో అవస్థలు

మాది పెంబి మండలం గుమ్మెన ఎల్లాపూర్. భారీ వర్షాలతో కాయన్‌పెల్లి, పెలాచెల్మల, దొత్తి వాగులపై ఏర్పాటుచేసిన తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోయాయి. మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. దారులను బాగు చేయించాలని కోరుతున్నాం.

చెరువు ఆక్రమణ

కుభీరు గ్రామానికి ఆనుకుని చెరువు భూమిని ఆక్రమించుకుని రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. అక్కడ మురుగు కాలువ శుభ్రం చేయడానికి వీల్లేకుండా ఉండటంతో ఆ మురుగు పక్కనే ఉన్న ఇళ్లు, ప్రభుత్వ ఆసుపత్రి, ఆలయం, వ్యవసాయ భూముల్లోకి వెళ్తోంది. చెరువు భూమిని స్వాధీనం చేసుకుని సమస్యను పరిష్కరించాలి. జామ్‌గాం-పార్డి(కె) గ్రామాలకు వెళ్లే దారి కబ్జాకు గురైంది. కబ్జాదారులపై చర్యలు తీసుకుని పాత దారి ఉండేలా చూడాలని గ్రామస్థులు విన్నవించారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

ఖానాపూర్ మార్గంలోని ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారని నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. పార్కింగ్ స్థలం వదలలేదని, భవనం చుట్టూ ఖాళీ స్థలం వదలకుండా నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అనుమతులు ఒక విధంగా నిర్మాణం మరో విధంగా ఉంది. దీనిపై విచారణ జరిపించి మాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.


రైతు హామీల సాధన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రామారావు పటేల్

రైతుల కష్టాలు ఎప్పుడు తీర్చుతారు

భైంసా, న్యూస్‌టుడే: అధికారంలోకి రాగానే రైతుల కష్టాలు తీర్చుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ వారిని మరిన్ని కష్టాల్లోకి నెట్టిందని శాసనసభ్యుడు పి.రామారావు పటేల్ అన్నారు. సోమవారం హైదరాబాదులో భాజపా నిర్వహించిన రైతు హామీల సాధన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి కారణంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా భాజపా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతుందని చెప్పారు.

ట్రెజరీ జిల్లా అధికారిగా ఎస్.సరోజ

నిర్మల్, న్యూస్‌టుడే: ట్రెజరీ జిల్లా అధికారిగా ఎస్.సరోజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఇదివరకు ఈమె హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో డిప్యూటీ డైరెక్టర్ (అకౌంట్స్)గా విధులు నిర్వర్తించారు.



రూ.80 కోట్ల నిధుల విడుదలకు కృషి

నిర్మల్, న్యూస్‌టుడే: పట్టణంలోని 42 వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి రావాల్సిన రూ.80 కోట్ల నిధుల విడుదలకు కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు, మంచినీటి సరఫరా, పలు అభివృద్ధి పనులకు గతంలో మంజూరైన రూ.80 కోట్లు నిధులు నిలిచిపోయాయని, వాటి విడుదలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు విన్నవించడంతో ఆమె దస్త్రాన్ని సీఎంకు అందజేశారని చెప్పారు. అదనపు నిధుల కోసం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిల సమన్వయంతో మంత్రి సీతక్క సాయంతో 42 వార్డుల కౌన్సిలర్లతో కలిసి సీఎంను కలుస్తామని చెప్పారు. పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, డీఈ జాదవ్ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతేరాజు 8లో

నిశిరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

✷ నలుగురి దుర్మరణం
✷ గుడిహత్నూరు మండలం మేకలగండి వద్ద ఘటన

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

వారంతా నిశిరాత్రి కారులో ఇంటికొస్తున్నారు. మరో 15 నిమిషాలైతే ఇంటికి చేరేవారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను రాసుకుంటూ దూసుకెళ్లింది. అదుపు తప్పి సిమెంట్‌కాల్వలో బోల్తాపడటంతో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారి-44 పై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అదుపు తప్పిన కారు డివైడర్‌ను రాసుకుని దాదాపు వంద మీటర్లు వెళ్లి ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో మోయిజ్(60), అలీ(8), ఖాజా మోయినొద్దీన్(40), మొహమ్మద్ ఉస్మానుద్దీన్(11) దుర్మరణం పాలయ్యారు. ఆయేషా ఆఫ్రీన్, ఫరీద్, ఎక్రా, సాథ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని సంఘటనా స్థలం నుంచి మూడు 108 అంబులెన్స్‌ల ద్వారా రిమ్స్‌కు తరలించారు. వీరంతా ఆదిలాబాద్‌కు చెందినవారే. మేకల గండి నుంచి ఆదిలాబాద్ 15 కి.మీ.దూరం. 15 నిమిషాల్లో ఇంటికి చేరే వారని అంతలోనే మృత్యువు కబళించిందని బంధువులు రోదించారు.



ప్రమాదం ఊహాచిత్రం




మృతులు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

అరటికి ప్రత్యేక రాయితీ



ఆయిల్‌పామ్‌లో అరటిని అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 50 నుంచి 57 వరకు ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేస్తారు. అయితే అరటిని మధ్యలో ఎకరానికి 1200 వరకు మొక్కలు సాగు చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీ ఇస్తుంది. 11 నెలలకు ఒకసారి చేతికి వచ్చే అరటి వల్ల ఎకరానికి రూ. ఒక లక్ష అదనంగా ఆదాయం పొందే అవకాశముంది.

సోయాబీన్.. గిట్టుబాటు



ఆయిల్‌పామ్‌లో సాగు చేసే మరో పంట సోయాబీన్.. మూడు నెలల పంట. దీన్ని రెండు ఆయిల్‌పామ్ సాళ్ల మధ్య ఆరు నుంచి ఏడు సాళ్లు సాగు చేయవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు చేతికి వస్తుంది. రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు అదనంగా ఆదాయం పొందే అవకాశముంది. దీని తర్వాత తిరిగి శనగను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. వీటితో పాటు పత్తి, అరటి, ఉల్లి, కూరగాయలు, కందిని అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. ప్రధాన పంటలో మధ్యమధ్య సాళ్లలో వీటిని సాగు చేయడం వల్ల ఆయిల్ పామ్‌తో పాటు అంతర పంటలతో అదనంగా ఆదాయం పొందే అవకాశముంది

అంతర సాగు..
ఆదాయం బాగు..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు ఇప్పుడిప్పుడే ఉద్యానవన పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ఏటా సాగు పెరుగుతోంది. సాగు పెంచేందుకు రాయితీలు అందజేస్తూ ప్రోత్సహిస్తుండటంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇందులో అంతర పంటలు సాగు చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉండటం... దీనికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో రైతులు ఆయిల్ పామ్‌లో అంతరపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఒకే చేనులో.. ఒకే పెట్టుబడితో రెండు రకాల పంటలు పండించడం తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అంతరపంటలపై దృష్టి సారిస్తే మరింత దిగుబడి సాధించవచ్చని మంచిర్యాల క్లస్టర్ ఉద్యానవన అధికారి సహజ వివరించారు.

రైతేరాజు

రాయితీ ఇలా:

రైతులు దీనిని ఎన్ని ఎకరాల్లోనైనా సాగు చేసుకోవచ్చు. ఒక మొక్క ధర రూ. 193 కాగా దీనిని రూ. 20కే అందిస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా రైతులు ఎకరాకు రూ. 1100 చెల్లించాలి. బిందు సేద్యం రాయితీని ఒక రైతుకు పన్నెండున్నర ఎకరాలలోపు మాత్రమే అందిస్తారు. అంతర పంటలు సాగు చేస్తే మొక్కలు పెరిగే వరకు నిర్వహణకు ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారు.

నేరుగా మిల్లుకు..



ఆయిల్‌పామ్ మధ్యలో సరుగుడు మొక్కలను ఎకరానికి రెండు వేలు నాటవచ్చు. రెండేళ్ల తర్వాత పెరిగిన చెట్ల కొయ్యలు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు. వీటిని నేరుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని మిల్లుకు తరలిస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. రవాణాతో కలిపి ఒక్కో మొక్కకు రూ. 2.50 పైసల ఖర్చు వస్తుంది. పెరిగిన తర్వాత కంపెనీ వారే రైతుల చేలల్లోకి వచ్చి ఉచితంగా చెట్లను కొట్టించి తీసుకెళ్లి పంటను బట్టి డబ్బులు అందజేస్తారు.

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం



శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి.
చరవాణి సంఖ్య: 91002 29854

?: బెండలో పచ్చదోమ ఆశిస్తోంది. ఎలా నివారించవచ్చు? **శంకర్ రైతు, చింతగూడ**

✓ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. - **న్యూస్‌టుడే, దండేపల్లి**

జీవాలలో నీలి నాలుక వ్యాధి నివారణ ఇలా..

మీకు తెలుసా?

జీవాలలో ఎక్కువగా వచ్చేది నీలి నాలుక వ్యాధి. ఇది రియోవిరిడే అనే కుటుంబానికి చెందిన వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వల్ల రక్త కణాలు దెబ్బ తినడంతో పాటు రక్త నాళాలు వాస్తాయని పశువైద్యాధికారి డా.ధన్‌రాజ్ పేర్కొన్నారు. దీంతో పాటు కాళి గిట్టల వ్యాప్తని దీనివల్ల నడవడం ఇబ్బందిగా మారి కుంటుతాయని వివరించారు. ఈ వ్యాధి నివారణకు ఉప్పు కలిగిన గంజి, రాగి జావ, ఓఆర్ఎస్ ద్రావణం క్రమం తప్పకుండా తాగించాలని వివరించారు. దీంతో పాటు ముందస్తుగా టీకాలు వేయించాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. - **న్యూస్‌టుడే, దండేపల్లి**

పండగల వేళ.. లాభాల బంతి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం : సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేసే అన్నదాతలకు ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. ఇప్పుడు పూలకు భలే గిరాకీ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బంతి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు ఆదిలాబాద్ గ్రామీణ మండలం కచ్‌కంటి గ్రామానికి చెందిన కొమ్ముల సంజీవ్.



సంజీవ్ సాగు చేస్తున్న బంతి తోట

ఆదర్శం

కచ్‌కంటి గ్రామానికి చెందిన కొమ్ముల సంజీవ్ పత్తి ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. ఆరు ఎకరాలు కౌలు తీసుకొని నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మిగతా భూమిలో సంజీవ్ బంతి పూల సాగు చేపట్టాడు. బిందు సేద్యం ఏర్పాటు చేసుకొని బడి వచ్చేలా ప్రణాళికతో పచ్చ, ఎర్ర బంతి మొక్కలు నాటారు. లక్ష పెట్టుబడిగా పెట్టగా.. విత్తనాలకు రూ.50 వేలు ఖర్చు చేశారు. నాలుగు నెలలకే దిగుబడి చేతికొచ్చింది. ఇప్పటికే వినాయక చవితి పండగకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. ఒక్క ఎకరానికి 5 నుంచి 6 టన్నుల బంతి పూలు దిగుబడిగా వస్తున్నాయని రైతు చెబుతున్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే లక్షన్నర లాభం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులు బంతిపూల సాగు చేస్తున్నారు. వ్యాపారులు తోట వద్దకే రావడం.. స్థానిక మార్కెట్‌లోనే పూలను విక్రయం చేయడంతో రవాణా ఖర్చులు కలిసి వస్తోంది. దీంతో అనుకున్నంత లాభం వస్తోంది. దసరా, దీపావళికి పూల ధరలు పెరగడంతో మరింత మెరుగైన ఆదాయం వస్తుందని అంటున్నారు.

భారీగా ఆశలు
తీరాలి బాధలు





పెన్‌గంగపై నిర్మాణంలో ఉన్న చనాఖా కొరాట రిజర్వాయర్

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ప్రాజెక్టుల్లో 75 శాతం, అంతకన్నా ఎక్కువ నిర్మాణం పూర్తయిన వాటికి అవసరమైన నిధులిచ్చి పనులు పూర్తి చేసి సాగు నీరు అందించే ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో అయిదు ఉన్నట్లు గుర్తించారు. మొదటి కేటగిరీలో నాలుగు ప్రాజెక్టులుండగా రెండో కేటగిరీలో ఒక ప్రాజెక్టు ఉంది. ప్రస్తుతం రూ. 167.83 కోట్లు మంజూరు చేస్తే వచ్చే వానాకాలంలో 28 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదించడంతో నిధుల విడుదలకు సీఎం అంగీకరించడంతో ఆశలు చిగురించాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18కిపైగా ప్రాజెక్టులు ఉన్నా వీటిలో చాలా వరకు కొద్ది మొత్తంలో పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. తక్కువ ఖర్చుతో వానాకాలం సీజన్‌లో సాగు నీటిని అందించే ప్రాజెక్టులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం, సదర్మాట్ తోపాటు మంచిర్యాల జిల్లాలో నీల్వాయి ప్రాజెక్టు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

రెండో కేటగిరీలో పెన్‌గంగ

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కింద 50,800 ఎకరాలకు సాగు నీరు అందాలి. ప్రాజెక్టు పరిధిలో చనాఖా కొరాట రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు పూర్తి చేస్తే వచ్చే వానాకాలం సీజన్‌లో 27,794 ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందుకు రూ. 147.23 కోట్లు అవసరం. ప్రతి నెల ఎంత మొత్తం అవసరమో అంచనాకు రావడంతో పాటు ఈ నిధులను క్రమం తప్పకుండా ఇవ్వాలని, అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయగలుగుతామని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ప్రాజెక్టులు, నిధుల అవసరం, సాగులోకి వచ్చే ఎకరాలు

ప్రాజెక్టు	నిధులు	ఎకరాలు
లోయర్ పెన్‌గంగ	147.23	27,794
మత్తడివాగు	4.39	1,200
సదర్మాట్	97.37	18,016
పిప్రి	49.07	4,214
నీల్వాయి	17.00	5,000

● నిర్మల్, జగిత్యాల జిల్లాలకు మేలు చేసే సదర్మాట్ ప్రాజెక్టు చివరి దశలో ఉంది. రూ. 97.37 కోట్లు వెచ్చిస్తే 18 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. దీనికి విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● మంచిర్యాల జిల్లా పరిధిలోని నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. ఇటీవల రూ. 50 లక్షలు అటవీశాఖకు చెల్లించడంతో అనుమతులు వచ్చే వీలుంది. రూ. 17 కోట్లు మంజూరు చేస్తే ఎడమ కాలువ కింద 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కింద కాలువలు లేకుండా సాగు నీరు అందించేందుకు వీలుగా పనులు పూర్తికాగా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. వీటికి రూ. 4.39 కోట్లు విడుదల చేస్తే అదనంగా మరో 1200 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలో మోటార్లు, పైప్‌లైన్, విద్యుత్తు సౌకర్యం తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. రూ. 49.07 కోట్లు మంజూరు చేస్తే 4,214 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయండి

ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్

ఉట్నూరు, ఇంద్రవెల్లి న్యూస్‌టుడే : గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ఆదేశించారు. సోమవారం ఉట్నూరు పీఏమ్మార్సీలో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు క్షేత్రస్థాయి నుంచే ఎంపికను చేపట్టాలన్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పథకాల మంజూరు పత్రంను అందజేశారు. అంతకుముందు ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి దేశంలో ఆదర్శ జిన్నింగ్‌గా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి కృషి చేస్తామని ఆయన అన్నారు. నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రవెల్లి గిరిజన అమరవీరులకు నివాళులర్పించారు. సేంద్రియ ఎరువుల ద్వారా కూరగాయలు సాగు చేస్తే వారికి రాష్ట్ర రాజధానిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ట్రైకార్‌తోపాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు కృషి చేస్తారన్నారు. ఏపీఓ(జనరల్) జాదవ్ వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, లక్ష్మీప్రసాద్, ఈఈ రాఠోడ్ భీంరావు, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు,అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

సన్మానం

నిర్మల్: ఉట్నూరు వెళుతున్న ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్‌ను సోమవారం నిర్మల్‌లో నాయకులు సన్మానించారు. నాయకులు రాజేందర్ హెపావత్, అశోక్ జాదవ్, కిషన్ నాయక్, గోవింద్ బానోత్, సురేశ్ నాయక్, శ్రీనివాస్, మోహన్‌నాయక్, జగదీశ్, రోహిదాస్, అంబాజీ పాల్గొన్నారు.

ధార్మిక పరిషత్ ఏర్పాటుతోనే ఆలయాల రక్షణ




మాట్లాడుతున్న రాజేందర్

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా దేవాలయాల నిర్వహణ కోసం పీఠాధిపతులు, స్వామీజీలు, ధార్మిక- సామాజిక పెద్దల నేతృత్వంలో ప్రత్యేకంగా ధార్మిక పరిషత్‌ను ఏర్పాటుచేయాలని విశ్వహిందూపరిషత్ విభాగ్ ధర్మాచార సంపర్క ప్రముఖ్ పతికె రాజేందర్ డిమాండ్ చేశారు. తిరుపతిలో లడ్డూ తయారీలో జరిగిన కల్తీ ఘటనను ఖండిస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల్లో తిష్ఠవేసిన అన్యమతస్తులను తొలగించాలని, అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయాల్లో ఉపయోగిస్తున్న పూజ, ప్రసాద సామగ్రిపై ఉన్నత స్థాయి సమీక్ష జరపాలని కోరారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేపట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆందోళనకు పలు హిందూ సంఘ నేతలు మద్దతు ప్రకటించారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్, నాయకులు మూర్తి ప్రభాకర్, సాదం ఆనంద్, చింతకుంట శ్రీనివాస్, ముప్పిడి రవి, ఎల్లుల్ల అనిల్, సద్ది శ్రీవాణి, వెంకటేశ్, ప్రణయ్, రాజేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ

ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో జిల్లాకు చెందిన పలువురు మెరుగైన ర్యాంకులతో ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో 342 ఖాళీల భర్తీకి డీఎస్సీ నిర్వహించారు. వాటి ఫలితాలు విడుదల అయ్యాయి. అర్హత సాధించిన వారి ధ్రువపత్రాలను మంగళవారం నుంచి పరిశీలించనున్నారు.

జిల్లా తొలి ర్యాంకు



భైంసా: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న టీజీటీ **పురిమిశెట్టి రవి** డీఎస్సీ ఫలితాల్లో సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. తానూరు మండలం బెల్‌తరోడా గ్రామానికి చెందిన నరేందర్, సులోచన దంపతుల కుమారుడు రవి తెలంగాణ గురుకుల పరీక్షల్లోనూ టీజీటీగా సాంఘిక శాస్త్రంలో రాష్ట్రంలో 8వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. దీంతో భైంసా మైనార్టీ గురుకుల పాఠశాల ఉద్యోగం పొందారు.

పెంబి: మండలంలోని లోతొర్యతండాకు చెందిన పలువురు అభ్యర్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. ఎస్ఏ విభాగంలో సపవత్ కిషోర్ 55, గుగ్లవత్ అనిల్ 62, నగావత్ నరేష్ 96, పీఈటీ విభాగంలో జాదవ్ సుధాకర్ 31, సపవత్ కిరణ్ 153 ర్యాంక్‌లు పొందారు. ఎస్జీటీ విభాగంలో ధరంసోత్ నీరజ 202, గుగ్లవత్ సనీల్ 2000 ర్యాకులు సాధించారు.

ఖానాపూర్: విద్యానగర్ కాలనీకి చెందిన సంద ప్రవళిక ఎస్జీటీ విభాగంలో 16వ ర్యాంకు, పద్మావతినగర్ కాలనీకి చెందిన గర్క లావణ్య 31వ ర్యాంకు సాధించారు. సాయికుమార్ 106 ర్యాంకు సాధించారు.

కడెం: మండలంలోని పెద్దూరుకు చెందిన చిటేటి నరేష్ స్కూల్ అసిస్టెంటు(సాంఘికశాస్త్రం) విభాగంలో జిల్లాస్థాయి రెండో ర్యాంకు సాధించాడు. నరేష్ ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కత్తెరపాక రాజ్‌కుమార్ ఎస్జీటీ విభాగంలో 161వ ర్యాంకు సాధించారు.

కుభీరు: కుభీరు మండలం పార్డి(కె) గ్రామానికి చెందిన మెట్‌పెల్లి సాయినాథ్ 108వ ర్యాంకు సాధించారు.



ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని బాదనకుర్తి వాసి **చుక్క విజయ్‌కుమార్** డీఎస్సీలో ఎస్జీటీ విభాగంలో 24వ ర్యాంకు సాధించారు.

ఆలూర్ యువకుడి ప్రతిభ



సారంగాపూర్: మండలంలోని ఆలూర్ వాసి **గొడిసెల విఘ్నేష్** జిల్లా స్థాయిలో ఓపెన్ విభాగంలో 44వ ర్యాంకు సాధించారు. ఎస్జీటీ జనరల్‌లో 52 పోస్టులు ఉన్నాయని తనకు తప్పనిసరిగా ఉపాధ్యాయ ఉద్యోగం ఓపెన్ కేటగిరిలో వస్తుందని బీసీ-ఏ కేటగిరికి చెందిన విఘ్నేశ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి బిడ్డకు ఆరో ర్యాంకు



నిర్మల్ గ్రామీణం: డీఎస్సీ సీఏ (సాంఘిక శాస్త్రం) విభాగంలో జిల్లా స్థాయిలో ఆరో ర్యాంకు సాధించి సత్తా చాటారు **గడ్డం అనూష**. నిర్మల్ మండలం వెంగ్వాపేట్‌కు చెందిన గడ్డం లక్ష్మి, జీవన్‌ల కూతురు అనూష. ఈమె చిన్నతనంలోనే తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయారు. పుట్టెడు దుఃఖంతో తల్లి బిడ్డను చదివించారు. ప్రయోజకురాలిగా తీర్చిదిద్దేందుకు కూలీ పని చేశారు. తల్లి కష్టాన్ని చూసిన అనూష చదువుపై దృష్టి నిలిపింది. పదో తరగతి వరకు స్వగ్రామం వెంగ్వాపేట్‌లో, మాధ్యమిక, డిగ్రీ, బీఈడీ వరకు ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి చేశారు. ఉపాధ్యాయురాలు కావాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివి టెట్ రాసి అత్యధిక మార్కులు సాధించారు. ఇటీవల విడుల చేసిన గురుకుల విద్యాసంస్థల ఫలితాల్లో 1:2 నిష్పత్తిలో నిలిచారు.

పడిలేచిన యువకెరటం..



దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన **నంద అనిల్** డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 7వ ర్యాంకు సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అనిల్ వ్యవసాయం చేస్తూ, మరో పక్క సహచట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించే వారు. 2013లో సర్పంచిగా గెలుపొందారు. తదుపరి 2019 ఎన్నికల్లో ఓటమి చెందడంతో సార్వత్రిక డిగ్రీ పూర్తిచేసి 2022లో బీఎడ్ చదివారు. డీఎస్సీకి సన్నద్ధమై ర్యాంకు తెచ్చుకున్నారు.



దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన రామగిరి నవ్య, మున్యాల్ గ్రామానికి చెందిన **బొడ్డు సుమలత** ఎస్జీటీ విభాగంలో జిల్లా రెండో ర్యాంక్‌లు సాధించారు. అదే గ్రామంలోని కోడూరి సుమలత, సూదం మౌనిక, దొనకంటి సాయిలీల, మండల కేంద్రానికి చెందిన రామగిరి నవ్య ఎస్జీటీ విభాగంలో చక్కటి ప్రతిభ కనబరిచారు.

రెండు ఉద్యోగాలు సాధించిన అన్వేష్



దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన **దొడ్డికింది అన్వేష్‌రెడ్డి** స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 10వ ర్యాంకు సాధించాడు. ఇటీవలే విడులైన గురుకుల ఉపాధ్యాయ కొలువుల్లో తెలుగు విభాగంలో 2వ ర్యాంకు సాధించి టీజీటీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు కొలువులు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో అన్వేష్‌రెడ్డి పోటీ పరీక్షలకు సిద్ధమై కొలువు సాధించాడు.

సమస్యలు తీర్చేలా కృషి చేయండి

నిర్మల్, న్యూస్‌టుడే: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తీర్చేలా కృషి చేయాలని కోరుతూ ఆ సంఘ బాధ్యులు సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నగదు రహిత సదుపాయం కల్పించాలని, ఆరోగ్య భద్రత కార్డు జారీ చేయాలని, ఇతరత్రా సమస్యలన్నీ పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో పెన్షనర్ల సంఘ జాతీయ కార్యదర్శి ఎం.సి.లింగన్న, జిల్లా కార్యదర్శి రావుల హన్మంత్ రెడ్డి, నాయకులు పూదరి జనార్దన్, గొజ్జ జనార్దన్, పొలిశెట్టి విలాస్, వెంకటపతి, ఎం.ఎ.కరీం, తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

నిర్మల్ అర్బన్: విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమేనని మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సోమవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ఎంపికైన వారు అక్టోబరు 2న జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని క్రీడల కన్వీనర్ టి.వాణి వెల్లడించారు. అర్బన్ ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, పోటీల నిర్వాహకుడు వన్నెల భూమన్న, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, సునీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా.. ఉపాధికి మార్గం

నేటి పోటీ ప్రపంచంలో తమ ఆలోచనలకు అనుగుణమైన విద్యా కోర్సుల ఎంపికతో పాటు నైపుణ్యానికి అనువైన ఉద్యోగాల వేట కోసం సరైన సమయంలో సమాచారం అందడం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఎన్ని నైపుణ్యాలు, ఎన్ని విద్యార్హతలు కలిగి ఉన్నా దానికి సంబంధించిన సమాచారం, దరఖాస్తు చేసే విధానం, ఆఖరు తేదీ వంటి అంశాలు తెలిసినపుడు ఉద్యోగార్థులకు, ఉన్నత విద్యనభ్యసించదలిచే విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన 'నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ టోల్‌ఫ్రీ నెంబరుతో విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యలను తీరుస్తోంది. -న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్

గ్రామీణ విద్యార్థులకు మేలు..

మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సేవ చాలా మేలు చేకూర్చేలా ఉపయోగపడుతోంది. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నా తగిన ఉద్యోగ సమాచారం సరైన సమయంలో తెలియక నష్టపోతున్నారు. ఈ సేవను వినియోగించుకుంటే ఈ సమస్యను చాలా వరకు అధిగమించవచ్చు.

హెల్ప్‌లైన్‌లో ప్రత్యక్ష సంభాషణ

నెంబరును ప్రెస్ చేసిన అనంతరం టెలీ కాలర్ అందుబాటులోకి వస్తారు. మనకు కావలసిన, మన సందేహాలకు నిపుణులు తగిన సమాచారాన్ని వెంటనే అందజేస్తారు. ప్రస్తుతం మన విద్యార్హతలు ఏమిటి అనే దాని ఆధారంగా ఎలాంటి ఉద్యోగాలకు అర్హులం లేదా ఇంకా అందుబాటులో ఉన్న ఉత్తమమైన కోర్సులు ఏవి అనే అంశాలను లోతుగా తెలుసుకోవచ్చు.

nirmaan.org
Vidya Helpline ...Enlightening Young India
We have only one passion the rise of a great Nation

టోల్‌ఫ్రీ నెంబరుతో అందుబాటులో..



1800 425 2425 అనే టోల్ ఫ్రీ నెంబరుకు పని దినాలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత కాల్ చేయొచ్చు. మొదట కంప్యూటర్ వాయిస్ ద్వారా వచ్చే సూచనలకు అనుగుణంగా విద్యా.. లేక ఉద్యోగ సమాచారమా అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులు తాము ఏ భాషలో సమాచారం పొందగోరుతున్నారో దానికి అనుగుణంగా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

వాట్సాప్ ద్వారా..



విద్యా, ఉద్యోగ సమాచారం కోసం 90009 72653 నెంబరుకు వాట్సాప్ ద్వారా పేరు, జిల్లా పేరు, విద్యార్హత వివరాలను పంపాలి. తద్వారా ఆ నెంబరు రిజిస్టర్ అయ్యి సమాచారం నిత్యం ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా అందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి సమాచారం వాట్సాప్‌లో మనకు కనిపిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా...
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

తీగలు తొలగింపు

ఈనాడు స్పందనకు వందనం

నిర్మల్: పట్టణ శివారు లోని ఓ నియంత్రికకు, విద్యుత్తు తీగలకు తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారిన తీరుపై ఆదివారం 'ఈనాడు'లో 'తీగలో తీగలై' శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. ఎస్ఈ శ్రీనివాస్, డీఈ నాగరాజు ఆదేశాల మేరకు ఏడీఈ రవి పర్యవేక్షణలో సిబ్బంది తీగలను తొలగించారు.


తీగలను తొలగించిన తర్వాత ఇలా.

రుణదాత ఒత్తిడితో ట్రాక్టర్ యజమాని ఆత్మహత్య

భైంసా, న్యూస్‌టుడే: ట్రాక్టరు కొనుగోలుకు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేని పరిస్థితిలో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి ఒత్తిడితో మనస్తాపానికి గురైఒకరు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు, సీఐ గోపీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పాలేపువార్ రాజేశ్(39) ఫైనాన్స్ సంస్థలో రుణం పొంది ట్రాక్టరు కొనుగోలు చేశారు. వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ ఉద్యోగి శ్రీనివాస్ రాజేశ్‌ను బెదిరించి దుర్భాషలాడాడు. డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చి, రాజేశ్, అతని భార్య ఫోన్లు లాక్కెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం ఫోన్లు తిరిగి ఇచ్చేసి డబ్బులు ఎప్పుడిస్తారని అడిగి వెళ్లి పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన రాజేశ్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరిస్తూ నాలుగు రోజుల క్రితం గల్లంతైన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన జయ (45) మృతదేహం ఆచూకీ సోమవారం లభ్యమైంది. ఆమె కోసం పోలీసులు గజ ఈతగాళ్లతో వెదికించినా ఫలితం దక్కలేదు. దిగువన లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామ సమీపంలో గోదావరి ఒడ్డున శవం కనిపించింది. పరిశీలించిన లోకేశ్వరం పోలీసులు అది జయ మృతదేహంగా నిర్ధారించి బాసర పోలీసులకు సమాచారం అందించారు. భైంసా ఆసుపత్రిలో శవపరీక్ష చేయించి బాసర ఎస్సై గణేశ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని పురుషుడి..

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో 61వ జాతీయరహదారి పక్కనే ఉన్న చెరువులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని దిలావర్‌పూర్ పోలీసులు గుర్తించారు. మృతుడు నీలం నలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, 40 ఏళ్లలోపు వయసు ఉంటుందని ఏఎస్సై భీమ్‌రావు తెలిపారు.

వివాహిత అదృశ్యం

భైంసా: పట్టణంలోని కుంట ప్రాంతానికి చెందిన మహిళ (46) అదృశ్యమైనట్లు సీఐ గోపీనాథ్ సోమవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలో చదువుకుంటున్న తన కూతురును చూసి వస్తానని ఈ నెల 25న తల్లికి చెప్పి వెళ్లారు. సాయంత్రం వరకు రాక పోవడంతో ఆమె కూతురుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఫిర్యాదు చేశారు.

జూదరుల పట్టివేత

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ శివారులో సరస్వతి కెనాల్ పక్కన సోమవారం జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు సోన్ ఎస్సై గోపి చెప్పారు. వారి నుంచి రూ.9790 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో చోరీ

నిర్మల్ పట్టణం, నిర్మల్ గ్రామీణం: వైఎస్సార్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దొంగతనం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోకి చొరబడ్డారు. కార్యాలయ గదిలో ఉన్న ల్యాప్‌టాప్, రూ.1,000 నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తాళం పగలగొట్టి ఉండటం గమనించి విస్తుపోయారు. లోపలకు వెళ్లిచూడగా వస్తువులు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

జ్వరంతో చిన్నారి మృతి


మన్విత్

కడెం: మండలంలోని కల్లెడకు చెందిన కొక్కుల సత్తన్న, సుమలతల కుమారుడు మన్విత్(6) జ్వరంతో బాధపడుతూ సోమవారం మరణించినట్లు గ్రామస్థులు, బంధువులు తెలిపారు. వారంనుంచి జ్వరంతో బాధపడుతుండగా తీవ్రత పెరగడంతో మూడు రోజులక్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డెంగీ జ్వరంగా నిర్ధారించారని, పరిస్థితి విషమించి మరణించాడని సమాచారం.

దసరా మహోత్సవాలకు రండి

నిర్మల్: బాసర అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్, వేద పండితులు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలకు ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు.

జిల్లాలో 30 పోలీస్‌యాక్టు అమలు

నిర్మల్ పట్టణం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో అక్టోబరు 1 నుంచి 31 వరకు 30 పోలీస్‌యాక్టు అమల్లో ఉంటుందని జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిల తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ప్రజా సమావేశాలు, సభలు, ఊరేగింపులు, ధర్నాలు చేపట్టవద్దన్నారు.

చౌక ధరల దుకాణం ఇప్పించాలని బైఠాయింపు

నిర్మల్ అర్బన్: నిర్మల్‌లోని గాంధీనగర్‌కు చెందిన దళిత మహిళ గంధం రమాదేవికి మంజూరైన చౌకధరల దుకాణాన్ని వెంటనే ఆమెకు ఇప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. పట్టణంలోని ఓ దుకాణాన్ని ఆమెకు కేటాయించారని, కానీ దాన్ని మరొకరు నడిపిస్తున్నారని చెప్పారు. తెవ్యకాసం జిల్లా నాయకుడు మురళీమోహన్, బాధితురాలు పాల్గొన్నారు.

శరీరదానానికి అంగీకార పత్రం అందజేత

నిర్మల్ పట్టణం: జిల్లా పారామెడికల్ అధికారిగా పనిచేసిన జొన్న వినోద్‌కుమార్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు ఆయన సేవలను అభినందిస్తూ సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. తమ మరణానంతరం ప్రభుత్వ వైద్యకళాశాలకు తమ దేహాలను అప్పగిస్తామంటూ ఆయన సతీమణి విజయలక్ష్మితో కలిసి జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్‌కు అంగీకారపత్రం అందజేశారు.

సర్దుబాటు నిబంధనలు సవరించాలి: టీయూటీఎఫ్

నిర్మల్ పట్టణం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు అశాస్త్రీయంగా ఉన్నాయని విమర్శించారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను విడుదల చేయాలని, డీఎస్సీ ఆలస్యమయ్యే పక్షంలో విద్యావాలంటీర్ల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి: ఎస్టీయూ

ఖానాపూర్ గ్రామీణం: ఈ-కుబేర్‌లో పెండింగులో ఉన్న వివిధ రకాల అనుబంధ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని సత్తనపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడారు. త్వరలోనే సర్వీసు రూల్స్ సాధించి, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్, జూనియర్ లెక్చరర్లకు పదోన్నతులు ఇప్పించేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజేందర్, జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి సందమామ


తానూరులో..


సారంగాపూర్: జామ్ సాంఘిక సంక్షేమ విద్యాలయంలో ప్రిన్సిపల్ రాధిక, అధ్యాపకులు


ఖానాపూర్: ఏఆర్ఎస్ కళాశాలలో..


లోకేశ్వరం: రాజురాలో హనుమాన్ ఆలయం ఎదుట..


నిర్మల్ పట్టణంలోని జేవీఎన్ఆర్ పాఠశాలలో..

అతివల పూల సంబరం సోమవారం ముందస్తుగా ప్రారంభమైంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినుల తల్లులు, తదితరులు వేడుకల్లో పాల్పంచుకున్నారు.

– న్యూస్‌టుడే బృందం


భైంసా మండలం చుచుంద్ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ పేర్చుతున్న ఉపాధ్యాయురాలు, విద్యార్థులు


కుభీరులోని నచికేత పాఠశాలలో..


కుంటాలలోని విజయసాయి పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు


దస్తూరాబాద్ కేజీబీవీలో ఉపాధ్యాయినులు..


ముథోల్: అక్షర పాఠశాలలో..

ఉద్యోగ నియామకాల్లో కొరవడిన పారదర్శకత!

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థుల ఎంపికకు విధి, విధానాలను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఆ మేరకు పారదర్శకంగా అభ్యర్థులను ఎంపిక చేయడం అధికారుల బాధ్యత. కానీ సారంగాపూర్‌లో నిబంధనలు పాటించడం లేదని ఓ అభ్యర్థిని అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. జిల్లాలోని 13 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బందిని రిజర్వేషన్ల ప్రకారం నియామకానికి ఆగస్టు 21న నోటిఫికేషన్ జారీ చేశారు. సారంగాపూర్ మండలం జామ్ కస్తూర్బా విద్యాలయంలో అటెండర్ ఉద్యోగం బీసీ-బీ, అసిస్టెంట్ కుక్ పోస్టు బీసీ-డీ విభాగంలో కేటాయించారు. గడవులోగా అటెండర్‌కు 37, అసిస్టెంట్ కుక్‌కు 16 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 8 వరకు అభ్యంతరాలకు గడువిచ్చారు. 9న అభ్యర్థుల ఎంపిక పూర్తిచేసి 10న డీపీవో కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను నివేదించాల్సి ఉంది. దాదాపు 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎంపిక ప్రక్రియ పూర్తి కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్యోగాలకు ఎంఈవో కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎంపీడీవోలు సభ్యులుగా కమిటీ ఉంటుంది. దరఖాస్తులను కమిటీ పరిశీలించి రోస్టర్ ప్రకారం ఎంపిక చేయాలి. జాబితాను డీపీవో కార్యాలయానికి నివేదించాలి.

ఫిర్యాదు.. అటెండర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న రామోజీ కృష్ణవేణి అనే అభ్యర్థిని సోమవారం కలెక్టర్‌తో పాటు డీఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు దరఖాస్తు చేసుకున్న వారిలో అందరి కంటే తనకే ఎక్కువ మార్కులు ఉన్నాయని, మరికొందరు దరఖాస్తుతో కుల, ఇతర ధ్రువపత్రాలు జత చేయలేదని తెలిపారు. అయినా నిబంధనలు విస్మరించి తనను కాకుండా అలాంటి వారిని ఎంపిక చేస్తానని సారంగాపూర్ ఎంఈవో బహిరంగంగా చెప్పడం బాధించిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పరిశీలనకు సమయం పడుతుంది..
జి.మధుసూదన్, ఎంఈఓ, సారంగాపూర్

ఉద్యోగ నియామకాల్లో రకరకాల ఒత్తిళ్లు ఉంటాయి. దరఖాస్తుదారులు సమర్పించిన అన్ని ధ్రువపత్రాలను ఒరిజినల్ పత్రాలతో స్వయంగా ధ్రువీకరించుకున్నాకే ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తాం. చాలా మండలాల ఇన్చార్జి బాధ్యతలు ఉన్నాయి. పరిశీలనకు గడువు పడుతుంది.

గడువు ముగిసిన తర్వాత ఎలాంటి పత్రం తీసుకోరాదు: డీఈఓ

గడువు లోపలే అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలి. గడువు ముగిశాక ధ్రువపత్రాలు దరఖాస్తుతో జతచేయడానికి వీలు లేదు. అలాంటివి జరిగితే నియామకాల్లో పారదర్శకత ఉండదు.

సమస్యలపై నిర్విరామ పోరు: సీపీఎం

నిర్మల్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిర్విరామ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య అన్నారు. సోమవారం నిర్మల్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా సమావేశంలో మాట్లాడారు. సీపీఎంను గ్రామ, వార్డు స్థాయిలో బలోపేతం చేయాలని చెప్పారు. అక్టోబరు 28, 29 తేదీల్లో చేపట్టబోయే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, బి.సుజాత, కమిటీ సభ్యులు తొడసం శంభు, పి.గంగామణి, డి.పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిద్దాం


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నిర్మల్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కలిసికట్టుగా ఉద్యమిద్దామని పార్టీల, సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నవ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బీసీల సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ దీక్షకు 'పుర' ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జైహింద్‌గౌడ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, ఎస్.ఎన్.రెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆప్క గజేందర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే కుల గణన చేపట్టాలన్నారు. రానున్న సర్పంచి, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. నాయకులు అల్లూరి మల్లారెడ్డి, ఎస్.ఎన్.రెడ్డి, డా.మనోజ్‌యాదవ్, నవ సంఘర్షణ సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు మమత, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దనసుల మధు, కార్యదర్శి డి.నగేశ్, సభ్యులు సిలారి నవీన్, మీన సంతోష్, మర్రిపెద్ద బాలరాజ్, కిషన్, స్వదేశ్ పరికిండ్ల, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్, న్యూస్‌టుడే : రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గౌరవ వేతనం ప్రకటించాలని, ఒక క్వింటా రూ. 300 కమీషన్ పెంచాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పతికె రాజేందర్, ప్రధాన కార్యదర్శి మౌలానా, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

భైంసా, న్యూస్‌టుడే: బాసర అమ్మవారి క్షేత్రంలో భక్తుల కోసం అదనపు గదులు నిర్మింపజేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరినట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడలో సీఎంను కలిశానని తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలోనే బాసర క్షేత్రాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశామన్నారు. సీఎంను కలిసిన వారిలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి. ఆదివాసి రాష్ట్ర నాయకుడు తుకారం, సతీశ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, తుకారం తదితరులు

PUBLIC NOTICE

Know all men by those present that my client Sri Uppunuthula Naresh Goud, S/o. Narsa Goud R/o. H.No. 1-3-367, Shastri nagar, Nirmal-(T) Nirmal District, approached the State Bank of Indian Br. Shivaji Chowk, Nirmal for grant of loan intending to deposit his title deeds towards security. Among those title documents a Reg. Sale deed No. 788/86 dated 02-04-1986 of SRO Nirmal was Executed by M/s. (1) M.Mazharuddin S/o. Mohd. Sharief R/o. Ibrahimbagh, Nirmal (2) M. Bhooma Reddy S/o. Laxma Reddy and Laxmavva W/o. Bhooma Reddy R/o. Kisannagar, of Nizamabad District in favour of Uppunuthula Narsa Goud S/o. Venka Goud R/o. Mamada (V) of Nirmal District in respect of Plot No.11 extent 336.66 Sq. yards lies in Sy.No. 1074, 1075 and 1076 situated at Shastrinagar, Nirmal. Uppunuthula Narsa Goud towards more safety of Papers of said sale deed he has got it laminated. In this regard anybody has got doubt about its execution, attestation and registration etc. they may appear the under singed within a week days from today along with documentary evidence. Hence the notice

Sd/- **S.GOVERDHAN,** B.Sc., LL.B
Advocate & Notary, Priyadarshini Nagar, Nirmal

సంక్షిప్తం

నియామకం

నిర్మల్ అర్బన్: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా నిర్మల్‌కు చెందిన కత్తి విష్ణును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ ప్రకటించారు. ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను నిర్వహిస్తానని ఈ సందర్భంగా విష్ణు పేర్కొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజం నిర్మిద్దాం

నిర్మల్ పట్టణం: హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజరు ప్రతిమారెడ్డి అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రయాణప్రాంగణంలో ప్రయాణికులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

డీజీపీ జితేందర్‌కు సన్మానం

నిర్మల్: నిర్మల్ ఏఎస్పీగా సేవలందించి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను సోమవారం హైదరాబాద్‌లో పించనర్ల సంఘ జాతీయ కార్యదర్శి ఎం.సి.లింగన్న, విశ్రాంత ఎస్సై ఎం.ఎ.కరీం, పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

పరిశ్రమ నిర్మాణంపై గ్రామస్థులు ఫిర్యాదు

పెంబి: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో అనుమతులు లేకుండా మంచినీటి తయారీ పరిశ్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపిస్తూ సోమవారం గ్రామస్థులు తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాకాంత్‌కు ఫిర్యాదు అందజేశారు. గ్రామస్థులు మహేందర్, షమి, ఎల్లయ్య, గణేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల అందజేత

నిర్మల్ గ్రామీణం: వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు గ్రామానికి చెందిన అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగి జి.రాజేశ్వర్ రూ.6 వేల విలువైన నిఘంటువు(డిక్షనరీ) పుస్తకాలను సోమవారం అందజేశారు.

సమస్యలు తీర్చాలని విద్యార్థుల ఆందోళన

కడెం: తమ పాఠశాలలో సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం పోషకులతో కలిసి ఆందోళన చేపట్టారు. కొద్దిసేపు రహదారిపై, మరికొద్దిసేపు పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి పాములు వచ్చేలా ప్రమాదకరంగా మారిందని పోషకులు వాపోయారు. ఇదివరకు ఇద్దరు ఉపాధ్యాయులుండగా ఒకరు బదిలీపై వెళితే ఒకరే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడన్నారు. విషయం తెలుసుకుని పాఠశాలకు వచ్చిన ఎంఈఓ షేక్ హుసేన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి పోషకులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తీరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వృద్ధులకు అవగాహన

నర్సాపూర్(జి): వృద్ధులు 14567 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ముందస్తుగా రాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీడీఓ పుష్పలత, ఎంపీఓ తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సోన్: అనారోగ్య కారణాలతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గంజాల్ వాసి దర్శనం సురేష్(33) కుటుంబానికి ఆయన స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. 2006-07 ఆయనతో కలిసి చదువుకున్న మిత్రుల బృందం తలా కొంత జమచేసి రూ.50 వేలను సోమవారం సురేష్ ఇంటివద్ద వారి కుటుంబ సభ్యులకు అందించారు. బాలకృష్ణ, సురేష్, నరేష్, పణీందర్, మహేష్ తదితరులు ఉన్నారు.

సన్మానం

సారంగాపూర్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని నోడల్ అధికారి జనార్దన్ అన్నారు. సోమవారం మండలంలోని జౌళి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోల ధర్మరాజ్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

గంగనీళ్ల జాతర నిర్వహణపై సమీక్ష

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఈ నెల 5, 6 తేదీల్లో జరగనున్న గంగనీళ్ల జాతర ఉత్సవాలపై సోమవారం ఆలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో బి.రమేష్ అధ్యక్షతన జాతర తీరు, ఏర్పాట్లు, బందోబస్తు, తదితర విషయాలపై అధికారులు చర్చించారు. సమావేశంలో ఎస్సై ఎస్.శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీవో అజిత్‌ఖాన్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈ బదిలీ

నిర్మల్: నిర్మల్ మున్సిపల్ డీఈ జాదవ్ సంతోష్ భైంసా పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సి.వి.ఎన్.రాజు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది సన్మానించారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ప్రభుత్వ పాఠశాలకు బీరువా విరాళం

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల అవసరాలను తెలుసుకున్న గ్రామానికి చెందిన మోరె కౌసల్య బీరువాను సోమవారం పాఠశాలకు విరాళంగా అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నిర్మల్: ఉట్నూరులో జరిగిన జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో నిర్మల్‌లోని ఆశ్రమ పాఠశాల (బాలికలు), రాంనగర్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీ విభాగంలో బి.గౌతమి, కె.సోని, బి.నందిని, ఖోఖో విభాగంలో చెంచులక్ష్మి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.తుకారాం, పీడీ ఎం.రాంజీ తెలిపారు.

ఖానాపూర్: ఉట్నూరులో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వాలీబాల్, చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం గఫార్ తెలిపారు. అండర్-17 విభాగంలో పదోతరగతి విద్యార్థి శివ వాలీబాల్ పోటీలకు, అండర్-14 విభాగంలో ఎ.భీంరావ్ చెస్ విభాగంలో ఎంపికయ్యారని చెప్పారు.

కడెం: కడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సయ్యద్ ఫర్హాన్ త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు.


రాయదారిలో వయోవృద్ధులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు

వయోవృద్ధులకు సన్మానం

మామడ, న్యూస్‌టుడే: రాయదారిలో సోమవారం వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఆహారం, ఆరోగ్యంపై పెద్ద వయస్సు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రజనీదేవి, మండలంలోని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.